క్లుప్తంగా

నిబంధనలు అతిక్రమిస్తే చర్యలు



ఆటో డ్రైవర్లకు అవగాహన కల్పిస్తున్న ఎస్‌ఐ రమేష్

కోటవురట్ల: నిబంధనలు అతిక్రమిస్తే చట్టపరమైన చర్యలు తప్పవని ఎస్‌ఐ రమేష్ హెచ్చరించారు. స్థానిక ఆర్టీసీ కాంప్లెక్స్ ఆవరణలో ఆటో డ్రైవర్లకు సోమవారం అవగాహన కల్పించారు. ఎస్‌ఐ మాట్లాడుతూ ఆటో డ్రైవర్లు నిబంధనల ప్రకారం వాహనాలు నడపాలన్నారు. పరిమితికి మించి ప్రయాణికులను ఎక్కించుకున్నా, అతివేగంగా నడిపినా, లైసెన్సు లేకపోయినా చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ప్రయాణికులను సురక్షితంగా గమ్యస్థానానికి చేర్చాల్సిన బాధ్యత ఆటో డ్రైవర్లదేనన్నారు.

ముగిసిన అయ్యప్ప స్వాముల భిక్ష



మునగపాక అయ్యప్పస్వామి ఆలయ ప్రాంగణంలో భిక్ష చేస్తున్న స్వాములు

మునగపాక: స్థానిక అయ్యప్పస్వామి ఆలయ ప్రాంగణంలో ఏర్పాటు చేసిన భిక్ష సదుపాయం సోమవారంతో ముగిసింది. 41 రోజుల పాటు నిర్వహించిన భిక్ష సదుపాయాన్ని పలువురు మాలధారణ భక్తులు సద్వినియోగం చేసుకున్నారు. పోలిపాడ్యమితో భిక్ష సదుపాయాన్ని ముగించినట్లు నిర్వాహకులు తెలిపారు. ఆఖరి రోజు కావడంతో పలు ప్రాంతాలకు చెందిన స్వాములు భిక్ష స్వీకరించారు. 41 రోజుల పాటు స్వాములకు ఉచితంగా భిక్ష సదుపాయం కల్పించిన నిర్వాహకులను పలువురు అభినందించారు.

రోడ్డు ప్రమాదంలో వ్యక్తికి తీవ్ర గాయాలు



నుజ్జయిన ద్విచక్ర వాహనం

మునగపాక: మండలంలోని వెంకటాపురం సమీపంలో సోమవారం జరిగిన రోడ్డు ప్రమాదంలో ఓ వ్యక్తికి తీవ్ర గాయాలయ్యాయి. వివరాలిలా ఉన్నాయి. గవర్ల అనకాపల్లికి చెందిన మళ్ల నారాయణరావు పరవాడ ఫార్మాసిటీలో ఉద్యోగం చేస్తున్నాడు. ఎప్పటిలాగానే సోమవారం తన ద్విచక్ర వాహనంపై నారాయణరావు వెళ్తుండగా వెంకటాపురం–తానాం రోడ్డుకు మధ్యలో ఎదురుగా వస్తున్న లారీ బలంగా ఢీకొంది. ఈ సంఘటనలో బైక్ నడుపుతున్న నారాయణరావు కాలికి తీవ్ర గాయాలు కావడంతో అనకాపల్లి వంద పడకల ఆస్పత్రికి తరలించారు. మెరుగైన వైద్యం కోసం విశాఖ కేజీహెచ్‌కు తరలించారు. ఈ మేరకు మునగపాక పోలీసులు కేసు నమోదు చేసి, దర్యాప్తు చేస్తున్నారు.

దివ్యాంగులకు ఆటల పోటీలు



మ్యూజికల్ చైర్ పోటీలో పాల్గొన్న దివ్యాంగ విద్యార్థులు

మాకవరపాలెం : ప్రపంచ దివ్యాంగుల దినోత్సవం నేపథ్యంలో సోమవారం మండల కేంద్రంలోని భవిత కేంద్రం దివ్యాంగులకు ప్రాథమిక పాఠశాల ఆవరణలో ఆటల పోటీలు ఏర్పాటు చేశారు. దివ్యాంగులు మ్యూజికల్ చైర్, చిత్రలేఖనం, పాటలతోపాటు వివిధ పోటీల్లో ఎంతో ఉత్సాహంగా పాల్గొన్నారు. విజేతలకు మంగళవారం బహుమతులు అందజేస్తామని ఎంఈవో మూర్తి తెలిపారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు ఉషారాణి, మంగలక్ష్మి పాల్గొన్నారు.

– రావికమతం మండలం మేడివాడ హైస్కూల్‌లో అంతర్జాతీయ దివ్యాంగుల దినోత్సవాన్ని పురస్కరించుకొని సోమవారం ఆటల పోటీలు నిర్వహించారు. 48మంది విద్యార్థులు ఈ పోటీల్లో పాల్గొన్నారు. రన్నింగ్, కుర్చీ ఆటలతో పాటు పలు ఆటలను ఆడించారు. క్రీడల్లో దివ్యాంగులు మరింతగా రాణించాలని, అందుకు అవసరమైన సహాయం అందిస్తామని ప్రత్యేక అవసరాల పాఠశాల ఉపాధ్యాయులు చెప్పారు. విజేతలకు ఈ నెల 3న బహుమతులు అందజేస్తామని వారు చెప్పారు.

షెల్టర్ ఇవ్వని తుపాను భవనాలు!



గణపర్తిలో శిథిలమైన తుపాను షెల్టర్



శిథిలావస్థకు గురైన మెలిపాక తుపాను షెల్టర్

- వర్షాకాలం వస్తే భయం గుప్పెట్లో లోతట్టు ప్రాంత ప్రజలు
- 37 ఏళ్ల క్రితం నిర్మించిన భవనాలు నేడు శిథిలావస్థలో..
- పట్టించుకోని పాలకులు, అధికారులు

మునగపాక: ఏళ్ల తరబడి ప్రజలకు రక్షణగా నిర్మించిన తుపాను భవనాలు ప్రస్తుతం శిథిలావస్థకు చేరాయి. భవనాలకు కనీసం మరమ్మతులు కూడా చేపట్టిన దాఖలాలు లేవు. ఫలితంగా లోతట్టు ప్రాంతాల ప్రజలకు భారీ వర్షాల సమయంలో షెల్టర్ లేకుండా పోయింది. ఏటా వర్షా కాలం వస్తే చాలు ఈ ప్రాంత ప్రజలు భయం గుప్పెట్లో కొట్టుమిట్టాడుతున్నారు. మండలంలోని మెలిపాక, యాదగిరిపాలెం, చూచుకొండ, గణపర్తి, పల్లపు ఆనందపురం తదితర గ్రామాలు లోతట్టు ప్రాంతాల్లో ఉన్నాయి. ఎప్పుడు వరదలు వచ్చినా ఆయా ప్రాంతాలను ముంచేస్తుంటాయి. వర్షాకాలం వచ్చిందంటే చాలు ఎప్పుడు ఎలాంటి విపత్కర పరిస్థితులు ఎదురవుతాయోనన్న ఆందోళన ఉంటుంది. సమీపంలోని శారదానది ఉధృతి పెరుగుతుండడం.. అలాగే తరచూ గట్లు కోతకు గురవడం వంటి కారణాలతో ముంపు సమస్య ఎప్పుడూ పొంచే ఉంటోంది. అటువంటి పరిస్థితిల్లో ప్రజల రక్షణ కోసం 37 ఏళ్ల కిందట గణపర్తి, మెలిపాక గ్రామాల్లో తుపాన్ భవనాలు నిర్మించారు. ఆ తరువాత వీటి ఆలనా పాలన చూసే నాథుడు కరువై అధ్వానంగా తయారయ్యాయి.

పాలకుల శీత కన్ను

తుపాను సమయంలో తల దాచుకునేందుకు వీలుగా ఏర్పాటు చేసిన భవనాలు శిథిలావస్థకు గురైనా పాలకులు శీతకన్ను ప్రదర్శిస్తున్నారన్న విమర్శలు ఉన్నాయి. ఏటా భారీ వర్షాలు కురిసే సమయంలో ప్రజాప్రతినిధులు, ఉన్నతాధికారులు పర్యటించడం తప్ప, శిథిల భవనాలకు మరమ్మతులు చేపట్టాలన్న ఉద్దేశంలో వారిలో కనిపించలేదని స్థానికులు ఆవేదన వ్యక్తం చేశారు. వరద ఉధృతి నుంచి కాపాడుకునేందుకు అందుబాటులోకి తీసుకొచ్చిన తుపాను షెల్టర్ల పరిస్థితి రోజురోజుకూ దయనీయంగా మారుతోంది. ఇప్పటికైనా అధికారులు స్పందించి కొత్త భవనాలు మంజూరు చేయాలని లోతట్టు ప్రాంతాల ప్రజలు కోరుతున్నారు.

వర్షం పడితే భయమేస్తోంది..



గణపర్తిలో 37 సంవత్సరాల క్రితం తుపాను షెల్టర్ నిర్మించారు. ప్రసుత్తం శిథిలావస్థకు చేరింది. ఎప్పుడు ఎలాంటి ప్రమాదం జరుగుతుందోనని ఆందోళనగా ఉంది. వర్షా కాలంలో ఎప్పుడు ఎలాంటి పరిస్థితులు ఎదుర్కోవాల్సి వస్తుందోనని లోతట్టు ప్రజలు భయపడాల్సి వస్తోంది. అధికారులు తగు చర్యలు తీసుకోవాలి.

– మారిశెట్టి వెంకటరమణ, గణపర్తి

కొత్త భవనం నిర్మించాలి..



మెలిపాక తుపాను షెల్టర్ నిర్మించి ఏళ్లు గడుస్తున్నాయి. వరద ప్రభావిత ప్రాంతంలో ప్రజలకు ఎటువంటి ఇబ్బందులు లేకుండా తలదాచుకునేందుకు వీలుగా నిర్మించిన తుపాను భవనం ప్రస్తుతం అధ్వానంగా ఉంది. ఎప్పుడు కూలిపోతుందోనన్న భయం వెంటాడుతోంది. ప్రజాప్రతినిధులు, అధికారులు స్పందించి శిథిల భవనం తొలగించి కొత్త భవనం నిర్మించేందుకు కృషి చేయాలి.

– గుంట్ల అప్పారావు, మెలిపాక

ప్రభుత్వానికి నివేదిస్తాం..



మెలిపాక, గణపర్తి గ్రామా ల్లో శిథిల తుపాను భవనా లకు సంబంధించి ప్రభుత్వానికి నివేదిక అందజేస్తాం. లోతట్టు ప్రాంతాల ప్రజలకు ఎటువంటి ఇబ్బందులు లేకుండా ఉండేందుకు కొత్త భవన నిర్మాణాల అవసరం ఉంది. ప్రస్తుతం ఉన్న భవనాలు శిథిలావస్థలో ఉన్నా యి. ఉన్నతాధికారుల దృష్టికి సమస్యను తీసుకెళ్లి పరిష్కారానికి కృషి చేస్తాం.

– ఎస్.ఆదిమహేశ్వరరావు, తహసీల్దార్, మునగపాక

వెంకన్న ఆలయ నిర్మాణానికి విరాళాల సేకరణ



వేంకటేశ్వరస్వామి ఆలయ నిర్మాణానికి విరాళాలు సేకరిస్తున్న కమిటీ సభ్యులు

మునగపాక: ప్రతి ఒక్కరూ వేంకటేశ్వరస్వామి ఆలయ నిర్మాణంలో భాగస్వామ్యం కావాలని ఆలయ కమిటీ చైర్మన్ బొడ్డేడ ప్రసాద్ కోరారు. ఆదివారం రాత్రి మునగపాక బీసీ కాలనీలో విరాళాలు సేకరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ భక్తుల విరాళాలతో రూ.4 కోట్లకు పైగా ఆలయ నిర్మాణం చేపడుతున్నామన్నారు. ఇందుకోసం ప్రతి ఒక్కరూ తమవంతు సాయం అందించాలన్నారు. ఇంటింటికీ వెళ్లి కరపత్రాలు అందజేస్తూ విరాళాలు సేకరించారు. మునగపాకకు చెందిన ఆడారి గోపీ రూ.50వేలు, మళ్ల కృష్ణ రూ.50 వేలు విరాళం అందజేశారు. ఈ కార్యక్రమంలో కమిటీ సభ్యులు కాండ్రేగుల జగ్గారావు, కోనపల్లి రామ్మోహనరావు, వెలగా శ్రీనివాసరావు, ఆడారి రమణబాబు, పెంటకోట శ్రీనివాసరావు, ఆడారి లక్ష్మణరావు, తదితరులు పాల్గొన్నారు.

షష్ఠి మహోత్సవాలకు ఏర్పాట్లు

నర్సీపట్నం : సుబ్రహ్మణ్య షష్ఠి మహోత్సవాలకు మున్సిపాలిటీ శారదనగర్ బైపాస్ రోడ్డులో ఉన్న శ్రీ వల్లిదేవసేన సమేత సుబ్రహ్మణ్యేశ్వర స్వామి దేవాలయం ముస్తాబైంది. ఈ నెల 5 నుంచి 7వ తేదీ వరకు మహోత్సవాలను ఘనంగా నిర్వహించేందుకు ఆలయ కమిటీ ఏర్పాట్లు చేస్తున్నారు. వినాయకుడి పూజతో ప్రారంభమై సుబ్రహ్మణ్యస్వామి వారికి 60 లీటర్ల పాలతో అభిషేకం కనుల పండుగగా జరగనుంది. రాహు, కేతు పూజలు అనంతరం సుబ్రహ్మణ్యస్వామి వారి హోమం నిర్వహించడం జరుగుతుందని ఆలయ నిర్వాహకులు తెలిపారు.

8న 'స్వప్నం రాల్చిన అమృతం' నాటిక ప్రదర్శన



నాటిక ప్రదర్శన పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న జెడ్పీటీసీ మాజీ సభ్యుడు సంజీవరావు

మునగపాక: మండల కేంద్రమైన మునగపాకలో ఈ నెల 8న స్వప్నం రాల్చిన అమృతం నాటిక ప్రదర్శన జరగనున్నట్టు జెడ్పీటీసీ మాజీ సభ్యుడు మళ్ల సంజీవరావు తెలిపారు. ఇందుకు సంబంధించిన పోస్టర్‌ను ఆయన సోమవారం నందీశ్వర కళా ప్రాంగణంలో ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ దివంగత నాటకరంగ దర్శకుడు మొతికా సాంబశివరావు సంస్మరణ కార్యక్రమంలో భాగంగా కళాకారులను ప్రోత్సహించేందుకు నాటిక ప్రదర్శన ఏర్పాటు చేస్తున్నామన్నారు. రాత్రి 7 గంటలకు తులసీ కళావేదికపై సాంబశివరావు సంస్మరణ సభ జరుగుతుందన్నారు. అనంతరం జరిగే నాటిక ప్రదర్శనను విజయవంతం చేయాలన్నారు. కరీంనగర్‌కు చెందిన చైతన్య కళాభారతి సభ్యులు స్వప్నం రాల్చిన అమృతం నాటికను ప్రదర్శిస్తారని చెప్పారు. ఈ కార్యక్రమంలో టెక్కలి సూరప్పారావు, పెంటకోట సత్యనారాయణ, మళ్ల జగ్గప్పారావు, టెక్కలి కొండలరావు, మళ్ల రామజోగినాయుడు, మళ్ల కృష్ణ, ఆడారి సూర్యచంద్రరావు, ఆడారి మహేష్ తదితరులు పాల్గొన్నారు.

పద్య పఠనం పోటీల్లో విద్యార్థుల ప్రతిభ



విద్యార్థులకు ప్రశంసా పత్రాలు అందిస్తున్న ఉపాధ్యాయులు

నక్కపల్లి: మండలంలోని పెదబోదుగల్లం హైస్కూల్ 8వ తరగతి విద్యార్థినులు కోటబోయిన మేఘన, ఈగల హేమశ్రీ లు అనంతచ్ఛందం నానీస్ మహతీ ఛానల్ అంతర్జాతీయ పద్య పఠనం పోటీల్లో ప్రతిభ కనబరిచారు. గత నెల 24న తోపెళ్ళ సుబ్రహ్మణ్యం ఆధ్వర్యంలో నిర్వహించిన ఆన్‌లైన్ జూమ్ సమావేశంలో ఈ పోటీలు నిర్వహించారు. సీనియర్స్ విభాగంలో విద్యార్థులు ప్రతిభ కనబరిచారని హైస్కూల్ తెలుగు ఉపాధ్యాయుడు ఎస్.వి.ఎస్.ఆచార్యులు తెలిపారు. ఈ మేరకు విద్యార్థులకు నిర్వాహకులు అందించిన ప్రశంసా పత్రాలు, నగదు ప్రోత్సాహకాన్ని సోమవారం ప్రార్థనా సమయంలో పాఠశాల హెచ్‌ఎం చోడిశెట్టి సత్యనారాయణ, తెలుగు ఉపాధ్యాయుడు ఆచార్యులు, కుమారి, పాల్గుణరావు, చిన్నారావు, రమేష్, శ్రీదేవి తదితరులు అందజేశారు. ఈ సందర్భంగా ఆచార్యులు మాట్లాడుతూ పద్య పఠనం పట్ల, తెలుగు భాష పట్ల ఆసక్తిని పెంపొందించడానికి ఇటువంటి పోటీలు దోహదపడతాయన్నారు.

తాగునీటి ఎద్దడి నివారణకు ఇంటింటి కుళాయిలు



వాటర్ ట్యాంక్ నిర్మాణానికి శంకుస్థాపన చేస్తున్న హోంమంత్రి వంగలపూడి అనిత

పాయకరావుపేట: తాగునీటి ఎద్దడి లేకుండా ఇంటింటికీ కుళాయిలు ఏర్పాటు చేస్తున్నట్టు హోంమంత్రి వంగలపూడి అనిత తెలిపారు. పట్టణంలోని రాజుగారి బీడులో జలజీవన్ మిషన్ నిధులు రూ. 95 లక్షలతో తలపెట్టిన వాటర్ ట్యాంక్ నిర్మాణానికి ఆమె సోమవారం శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ గ్రామాల్లో రోడ్లు, కాలువల నిర్మాణం చేపడుతున్నామన్నారు. పట్టణంలో డ్రైనేజీ సమస్య పరిష్కారం కోసం కోటి రూపాయల నిధులు కేటాయిస్తున్నట్లు చెప్పారు. అనంతరం సమీపంలోని అంగన్‌వాడీ కేంద్రాన్ని ఆమె సందర్శించి చిన్నారులతో ముచ్చటించారు. పాయకరావుపేటలో మోడల్ పోలీసు స్టేషన్ ఏర్పాటు కోసం స్థల పరిశీలన కూడా చేశారు. నియోజకవర్గంలో పాయకరావుపేటలో గానీ, నక్కపల్లిలో గానీ మోడల్ పోలీసు స్టేషన్ ఏర్పాటు చేస్తున్నట్లు ఆమె తెలిపారు. ఈ కార్యక్రమంలో కూటమి నాయకులు పెదిరెడ్డి చిట్టిబాబు, గెడ్డం బుజ్జి, బోడపాటి శివదత్, పెదిరెడ్డి శ్రీను, గొర్రెల రాజుబాబు, మజ్జూరి నారాయణరావు, తదితరులు పాల్గొన్నారు.

ఉప్పుటేరులో చేపల మృత్యువాతపై నిరసన



చనిపోయిన చేపలతో ధర్నా చేస్తున్న మత్స్యకారులు, సీపీఎం నాయకులు

అచ్యుతాపురం: రెండు రోజులుగా కురుస్తున్న వర్షాలను ఆసరా చేసుకుని ఫార్మా కంపెనీలు ఉప్పుటేరులోకి రసాయన వ్యర్థాలను విడుదల చేయడం వల్ల చేపలు చనిపోయాయంటూ సీపీఎం ఆధ్వర్యంలో మత్స్యకారులు ఏపీఐఐసీ జోనల్ కార్యాలయం వద్ద సోమవారం ధర్నా నిర్వహించారు. ఉప్పుటేరులో చనిపోయిన చేపల్ని చూపిస్తూ నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా సీపీఎం మండల కన్వీనర్ ఆర్.రాము మాట్లాడుతూ కాలుష్యం వల్ల ఇప్పటికే లాలం కోడూరు, పూడిమడక, ఎస్ఈజెడ్ కాలనీ వాసులు తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారన్నారు. పూడిమడక ఉప్పుటేరులోకి రసాయన వ్యర్థాలను విడుదల చేయడం వల్ల మత్స్యసంపద మృత్యువాతకు గురవుతుందని ఆవేదన వ్యక్తం చేశారు. గతంలో చాలా సార్లు ఫిర్యాదు చేసినప్పటికీ చర్యలు శూన్యమని వారు వాపోయారు. తక్షణమే ఈ విషయమై సమగ్ర విచారణ జరిపి బాధ్యులపై చర్యలు తీసుకోవాలని కోరుతూ వారు జోనల్ మేనేజర్ హరిప్రసాదరావుకు వినతి పత్రం అందజేశారు. ఈ కార్యక్రమంలో చేపల తాతయ్య, రాజు, సన్యాసిరావు, నాయుడు, తదితరులు పాల్గొన్నారు.

విద్యుత్ చార్జీల పెంపుతో ప్రజలపై భారం

అనకాపల్లి: కూటమి ప్రభుత్వం దశలు వారీగా విద్యుత్ చార్జీలు పెంచుతూ సామాన్య ప్రజలపై పెనుభారం మోపుతుందని ప్రజా సంఘాల ఐక్యవేదిక జిల్లా అధ్యక్షుడు బొట్టా చిన్నయాదవ్ విమర్శించారు. స్థానిక నెహ్రూచౌక్ సంఘం కార్యాలయంలో సోమవారం జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడారు. టీడీపీ పాలకులు చాపకింద నీరులా స్మార్ట్ మీటర్లు బిగిస్తున్నారన్నారు. విద్యుత్ చార్జీలు పెంపునకు స్మార్ట్ మీటర్లు ఎంతగానో ఉపయోగపడతాయన్నారు. ఇప్పటికే ట్రూ అప్ చార్జీల పేరుతో సామాన్యుల నడ్డి విరిచారన్నారు. స్మార్ట్ మీటర్లతో మరింత బారం పడే అవకాశాలు ఉన్నాయని, ప్రభుత్వం తక్షణమే విద్యుత్ చార్జీలు తగ్గించాలని, లేని పక్షంలో ప్రజా సంఘాల ఆధ్వర్యంలో ధర్నాలు చేపడతామని హెచ్చరించారు.

నేత్రపర్వంగా పోలిపాడ్యమి పూజలు



యలమంచిలి కాశీవిశ్వేశ్వర స్వామి ఆలయంలో దీపారాధన చేస్తున్న భక్తులు



ఉపమాక పుష్కరిణి వద్ద పూజల అనంతరం దీపారాధనకు సిద్ధమవుతున్న భక్తులు



ఉపమాక పుష్కరిణిలో దీపాలు వెలిగిస్తున్న మహిళలు

యలమంచిలి రూరల్: నెల రోజుల పాటు జప, దానాలు, పూజలు, వ్రతాలు చేసిన మహిళలు సోమవారం ఉదయం పోలిపాడ్యమి పుణ్య దీపాలతో కార్తీక మాసం దీక్షలు విరమించారు. కార్తీక మాసం ముగింపు నేపథ్యంలో తెల్లవారుజామున భక్తులు పోలిని స్వర్గానికి పంపారు. స్థానికంగా ఉన్న శివాలయాలు భక్తులతో కిటకిటలాడాయి. అనేక మంది మహిళలు యలమంచిలికి సమీపాన ఉన్న పెంజెరువు వద్దకు వెళ్లి భక్తిశ్రద్ధలతో నేతిలో ముంచిన ఒత్తులను అరటిదొప్పలలో పెట్టి వెలిగించి పుణ్యదీపాలు నదిలో విడిచిపెట్టారు. స్థానిక కొత్తపేట శివాలయం భక్తుల శివనామ స్మరణతో మార్మోగింది.

నక్కపల్లి: పోలి పాడ్యమి సోమవారం భక్తులు అత్యంత భక్తి శ్రద్ధలతో జరుపుకొన్నారు. తెల్లవారు జామున నదులు, చెరువుల వద్ద పుణ్యస్నానం ఆచరించి అరటి దొప్పెలలో దీపాలు వెలిగించి నీటిలో విడిచిపెట్టారు. ఉపమాకలో వేంకటేశ్వరస్వామి పుష్కరిణి సోమవారం వేకువ జామున కొలాహలంగా మారింది. చుట్టు పక్కల గ్రామాల నుంచి వందలాది మంది మహిళలు స్నానాలు చేసి దీపారాధన చేశారు. పక్కనే ఉన్న శివాలయంలో ధ్వజ స్తంభం వద్ద దీపాలు వెలిగించి పరమ శివుడ్ని దర్శించుకున్నారు. వెంకన్న ఆలయం కూడా భక్తులు కిటకిటలాడింది. దీపారాధన అనంతరం పురోహితులకు భకుతలు స్వయం పాకాలు ఇచ్చుకుని ఆశీర్వాదం తీసుకున్నారు.

తోటాడలో అన్నదానం



తోటాడ భావనారుషి ఆలయంలో అన్న ప్రసాదం స్వీకరిస్తున్న భక్తులు

మునగపాక: మండలంలోని తోటాడలో భద్రావతి సమేత భావనారుషి కాశీ విశ్వేశ్వరస్వామి ఆలయంలో సోమవారం ఏర్పాటు చేసిన అన్నసమారాధనకు విశేష స్పందన లభించింది. పోలి పాడ్యమి సందర్భంగా ఉదయం నుంచి ఆలయ ప్రాంగణంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయ ధర్మకర్తలు దొడ్డి సూర్యనారాయణ, త్రినాథ్, సన్యాసిరావు, తాతబాబు, సత్యనారాయణ ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం అన్నప్రసాదం కార్యక్రమాన్ని ప్రారంభించారు. సర్పంచ్ దొడ్డి మంగవేణి, వైఎస్సార్‌సీపీ నేత దొడ్డి కోటేశ్వరరావు, మాజీ సర్పంచ్ పొలమరశెట్టి నాగేశ్వరరావు, పెద్దలు బుద్ద రామారావు, భుజంగరావు, దాడి శ్రీనివాసరావు, దొడ్డి రమేష్, ఆడారి ప్రసాద్, గెడ్డం బాబూరావు, తదితరులు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు.

విద్యార్థులకు బ్యాగుల పంపిణీ



విద్యార్థులకు బ్యాగులు అందిస్తున్న రాజుపేట సర్పంచ్ దేముడు

మునగపాక: విద్యార్థులు ఏకాగ్రతతో చదువుకుని మంచి ఫలితాలు సాధించాలని రాజుపేట సర్పంచ్ కిలాడి దేముడు కోరారు. మండలంలోని రాజుపేట ఎంపీయూపీ స్కూల్‌లో విద్యార్థులకు సోమవారం లోరియల్ చారిటీ ట్రస్ట్ సమకూర్చిన స్కూల్ బ్యాగులు, తాగునీటి బాటిళ్లు, కంపాస్ బాక్సులు, పెన్సిళ్లను ఆయన అందజేశారు. ఈ సందర్భంగా సర్పంచ్ మాట్లాడుతూ విద్యాభివృద్ధికి దాతలు అందిస్తున్న సహకారం అభినందనీయమన్నారు.

మాలల గర్జన జయప్రదం చేయండి

దేవరాపల్లి: ఎస్సీ వర్గీకరణపై సుప్రీం తీర్పును వ్యతిరేకిస్తూ ఈ నెల 8న విశాఖ జరిగే ఉత్తరాంధ్ర మాలల గర్జన సభను జయప్రదం చేయాలని నియోజకవర్గ కన్వీనర్ కాటపల్లి అప్పారావు పిలుపునిచ్చారు. దేవరాపల్లిలో ఎస్సీ వర్గీకరణ వ్యతిరేక పోరాట కమిటీ సభ్యుల సమావేశంలో సోమవారం గర్జన గోడ పత్రికను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విశాఖలోని గురజాడ కళాక్షేత్రంలో మధ్యాహ్నం 2 గంటలకు ఈ గర్జన జరుగుతుందన్నారు.

పరిసరాల పరిశుభ్రతపై జాగ్రత్తలు అవసరం



ధర్మవరం అగ్రహారంలో పర్యటిస్తున్న వైద్యారోగ్య శాఖ జేడీ మల్లేశ్వరి, తదితరులు

ఎస్.రాయవరం: గ్రామాల్లో పరిసరాల పరిశుభ్రతపై జాగ్రత్తలు అవసరమని వైద్య ఆరోగ్య శాఖ రాష్ట్ర జాయింట్ డైరెక్టర్ డాక్టర్ ఎస్.మల్లేశ్వరి సూచించారు. ధర్మవరం అగ్రహారం గ్రామంలో ఇటీవల ఐదుగురు కలుషిత ఆహారం తీసుకుని అస్వస్థతకు గురై, చికిత్స అనంతరం కోలుకున్నారు. ఈ మేరకు సోమవారం వైద్య ఆరోగ్య శాఖ రాష్ట్ర ఆరోగ్య డైరెక్టర్ ఎస్‌జెమల్లేశ్వరి ఐడీఎస్‌పీ బృంద సభ్యులు గ్రామంలో పర్యటించారు. కలుషిత ఆహారం తిని కోలుకున్న వారిని పరామర్శించారు. ఇంట్లో ఆహారం ఎలా కలుషితం అయ్యిందనే విషయంపై ఆరా తీసి పరిస్థితి తెలుసుకున్నారు. గ్రామంలో పరిసరాలు పరిశుభ్రతపై పంచాయతీ అధికారులు ఎప్పటికప్పుడు పరిశీలించాలన్నారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర ఐడీఎస్‌పీ కోఆర్డినేటర్ హెచ్.వెంకటేశ్వర్లు, జిల్లా సర్వే ఆఫీసర్ డి.వినోద్‌కుమార్, పెనుగొల్లు పీహెచ్‌సీ వైద్యాధికారి రాజేశ్వరి, జిల్లా ఎపిడెమిక్ సెల్ ఎంపీహెచ్ఈవో సన్యాసిరావు, ఎంపీహెచ్ఎస్ సాంబశివ, పీహెచ్‌సీ సిబ్బంది పాల్గొన్నారు.

ఉత్తమ ఉపాధ్యాయ అవార్డు గ్రహీతలకు సన్మానం



ఉత్తమ ఉపాధ్యాయులను సత్కరిస్తున్న పీఆర్‌టీయూ నాయకులు

ఎస్.రాయవరం: ఉత్తమ ఉపాధ్యాయ అవార్డు పొందిన ఉపాధ్యాయులు మరింత ఆదర్శవంతంగా పని చేయాలని మాజీ ఎమ్మెల్సీ గాదె శ్రీనివానివాసులు నాయుడు సూచించారు. అనకాపల్లి జిల్లాలో ఉత్తమ ఉపాధ్యాయ అవార్డు గ్రహీతలకు పీఆర్‌టీయూ ఆధ్వర్యంలో గోకులపాడు గ్రామంలో సోమవారం సన్మాన సభ నిర్వహించారు. ఉత్తమ ఉపాధ్యాయులుగా అవార్డులు అందుకున్న వారు మరికొంత మంది ఉపాధ్యాయులు ఈ అవార్డులకు ఎంపికయ్యేలా సూచనలు ఇవ్వాలన్నారు. ఈ కార్యక్రమంలో యలమంచిలి డిప్యూటీ డీఈవో పి.అప్పారావు, పీఆర్‌టీయూ జిల్లా అధ్యక్షుడు గోపీనాథ్, ఎంఈవో గాంధీ, యూనియన్ నాయకులు వీరభద్రరావు, వి.శ్రీనివాసరావు, ఎస్.సత్యనారాయణ, తదితరులు పాల్గొన్నారు.

ఉపాధ్యాయులు సమయపాలన పాటించాలి



వడ్డాది హైస్కూల్ జరిగే ప్రేయర్‌లో పాల్గొన్న డీఈవో అప్పారావునాయుడు

బుచ్చెయ్యపేట: ఉపాధ్యాయులు సమయపాలన పాటించాలని డీఈవో గిడ్డి అప్పారావు నాయుడు తెలిపారు. సోమవారం ఉదయం మేజర్ పంచాయతీ వడ్డాది కోవెల అప్పనదొర జిల్లా పరిషత్ హైస్కూల్‌ను ఆయన తనిఖీ చేశారు. డీఈవో పది గంటల సమయంలో వచ్చిన ఆ సమయంలో కొంతమంది ఉపాధ్యాయులు పాఠశాలకు రావడాన్ని గుర్తించారు. హైస్కూల్ ఉపాధ్యాయులు అందరూ ఉదయం 9.45 గంటలకే పాఠశాలకు చేరుకోవాలని సాయంత్రం 4 గంటల తరవాతే పాఠశాల నుంచి వెళ్లాలని డీఈవో సూచించారు. సమయపాలన పాటించని ఉపాధ్యాయులపై శాఖాపరమైన చర్యలు తీసుకుంటామన్నారు. డిసెంబర్ 7వ తేదీన వడ్డాది హై స్కూల్లో పేరెంట్స్ మీటింగ్ ఏర్పాటు చేయాలని హెచ్‌ఎం శేషుబాబుకు సూచించారు. పదో తరగతిలో శతశాతం విద్యార్థులు ఉత్తీర్ణత సాధించేలా బోధన ఉండాలని ఉపాధ్యాయులకు సూచించారు. ఎంఈవో కాశీ విశ్వేశ్వరరావు పాల్గొన్నారు.